నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
02.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
28 మే 2025
పేజీలు 8

**తువాలులో తొలి ఏటీఎం**

పసిఫిక్ దీవుల దేశం తువాలులో ఏప్రిల్ 15న మొదటి ఏటీఎంను ఆ దేశ ప్రధాని ఫెలెటి టియో, నేషనల్ బ్యాంక్ జనరల్ మేనేజర్ సియోస్ టియో ప్రారంభించారు. ఆస్ట్రేలియా-హవాయి మధ్య 10 చదరపు మైళ్ల వైశాల్యంలో ఈ దేశం ఉంది. తొమ్మిది దీవులతో కూడిన ఈ దేశంలో 11,200 మంది నివసిస్తున్నారు. ఫునఫుటిలో ఎయిర్‌పోర్ట్ ఉంది. పొరుగున గల ఫిజీ నుంచి వారానికి కొన్ని విమానాలు మాత్రమే ఇక్కడికి వస్తాయి.

# ‘తెలంగాణ నేతన్న భద్రత’ను గతంలో ఏమని పిలిచేవారు?

**గతవారం తరువాయి..**

**ఫోర్త్ సిటీ (భవిష్యత్ నగరం)**

- హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత నాలుగో పెద్ద నగరాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇది 7 మండలాల్లోని 56 గ్రామాల్లో 765.28 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఔటర్ రింగ్ రోడ్ అవతల, శ్రీశైలం జాతీయ రహదారి, నాగార్జున సాగర్ రాష్ట్ర రహదారి మధ్యలో రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేయనున్నారు. ఈ నగరంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ లాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో తెలంగాణ రాష్ట్రం ‘ది ఫ్యూచర్ స్టేట్’కు పర్యాయపదంగా ఉంటుంది.

**కాటమయ్య కిట్**

- 2024, జూలై 14న రంగారెడ్డి జిల్లా లష్కరిగూడ గ్రామంలో సీఎం ప్రారంభించారు.
- కల్లుగీత కార్మికులు తాటి, ఈత చెట్లపై పని చేసేటప్పుడు వారి ప్రాణాలను కాపాడేందుకు ఒక్కో కల్లు గీత కార్మికుడికి రూ. 10,000 చొప్పున వ్యక్తిగత రక్షణ పరికరాలు ఈ పథకం ద్వారా అందిస్తారు.
- ఈ పథకంలో భాగంగా 10,000 కాటమయ్య రక్షక కిట్లను పంపిణీ చేశారు. రెండో దశలో కిట్ల పంపిణీ చేస్తారు. అదనంగా 15,000 భద్రతా కిట్లను కొనుగోలు చేస్తున్నారు.
- 2024-25 సంవత్సరానికి ఈ పథకానికి ప్రభుత్వం రూ. 68 కోట్లు ఆమోదించగా, రూ. 34 కోట్లు విడుదల చేసింది.
- ఈ కిట్ల కొనుగోలు, శిక్షణ ఖర్చుల కోసం రూ. 23.50 కోట్లు ఖర్చు చేశారు.

**ఆరోగ్య లక్ష్మి**

- ఈ పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, 6 సంవత్సరాల్లోపు చిన్నారులకు సమృద్ధిగా పోషక విలువలున్న సంపూర్ణ భోజనాన్ని ప్రభుత్వం అందిస్తుంది.
- ఈ పథకం ద్వారా నెలలో 25 రోజుల పాటు అన్నం, పప్పు, నూనె, కూరగాయలు, మసాలా దినుసులతో కూడిన ఒక పూట భోజనం, ఉడికించిన గుడ్డు, 200 మి.లీ పాలు గర్భిణులు, బాలింతలకు 30 రోజుల పాటు అందిస్తున్నారు. 3 నుంచి 6 సంవత్సరాల్లోపు పిల్లలకు 25 రోజుల పాటు ఒకపూట భోజనం, స్నాక్స్, 30 రోజుల పాటు ఉడికించిన గుడ్లు ఇస్తారు.
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3,33,309 మంది గర్భిణులు, బాలింతలు, 3 నుంచి 6 సంవత్సరాల్లోపు 8,52,061 మంది పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారు.



**పోటీ పరీక్షల ప్రత్యేకం ఎకానమీ**

**బాలామృతం**

- 7 నెలల నుంచి 3 సంవత్సరాల్లోపు గల చిన్నారులకు 2.5 కిలోల బాలామృతం ప్యాకెట్, 16 గుడ్లు అందిస్తున్నారు.
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో 9,75,007 మంది చిన్నారులకు బాలామృతం ప్యాకెట్లను అందించారు.
- బాలామృతాన్ని వేయించిన గోధుమలు, శనగపప్పు, పాలపొడి, చక్కెర, నూనెతో కలిపి తయారు చేస్తారు. పిల్లలకు అవసరమయ్యే ఐరన్, కాల్షియం, విటమిన్స్ మొదలైనవి ఉంటాయి.
- రాష్ట్రంలోని మొత్తం అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య- 37,500

**మిషన్ శక్తి**

- 2021-22 నుంచి 2025-26 (15వ ఆర్థిక సంఘం కాలంలో) వరకు అమలు చేయడానికి మహిళల భద్రత, సాధికారత కోసం భారత ప్రభుత్వం ‘మిషన్ శక్తి’ అనే సమగ్ర మహిళా సాధికారత కార్యక్రమాన్ని ప్రారంభించింది.
- ఈ పథకంలో 2 ఉప పథకాల ద్వారా మహిళల భద్రత, సాధికారతను పెంపొందించే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. అవి..

1) **సంబల్:** వన్ స్టాప్ సెంటర్లు (వోఎస్‌సీ), మహిళా హెల్ప్‌లైన్ 181 వంటి కార్యక్రమాలతో భద్రతపై దృష్టి పెడుతుంది.

- తెలంగాణలో ఈ పథకం ప్రారంభమైన ప్పటి నుంచి రాష్ట్రంలో 36 వోఎస్‌సీలు మహిళలపై వివిధ రకాల హింసకు సంబంధించిన 72,183 కేసులను పరిష్కరించారు.
- గృహహింస, లైంగిక, సైబర్ నేరాలు, ఇతర సమస్యలపై మహిళా హెల్ప్‌లైన్‌కు 22.32 లక్షల ఫిర్యాదులు వచ్చాయి.
- సంబల్‌లో భాగమైన ‘బేటీ బచావో బేటీ పఢావో’ తెలంగాణలోని 33 జిల్లాల్లోని ఆడపిల్లలను రక్షించడం, విద్య అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

2) **సామర్థ్య:** ఈ ఉప పథకం మహిళలకు ఆశ్రయం, మహిళా సాధికారతను ప్రోత్సహిస్తుంది.

- ఈ ఉప పథకం 20 శక్తి సదన్‌ల ద్వారా మహిళా సాధికారతను ప్రోత్సహిస్తుంది. మహిళలకు ఆశ్రయం కల్పించే 18 స్వధార్ గృహాలు, అక్రమ రవాణా బాధితులను ఆదుకునేందుకు 2 ఉజ్వల గృహాలు ఉన్నాయి.

**గిరి వికాసం**

- షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) చిన్న (ఉపాంత), సన్నకారు రైతుల బీడు, సాగు చేయలేని భూములకు నీటిపారుదల సౌకర్యాలను కల్పించడం, స్థిరమైన వ్యవసాయ అభివృద్ధి కోసం వాటిని సాగు, ఉత్పాదక భూములుగా మార్చడం ఈ పథకం ఉద్దేశం.
- ఈ పథకానికి రూ. 141.56 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటి వరకు 24,167 ఎస్టీ రైతులకు చెందిన 69,893 ఎకరాల భూమిని వ్యవసాయోగ్యంగా మార్చడం కోసం ఖర్చు చేశారు.

**గిరిజనుల సహకార కార్పొరేషన్ - ప్రాసెసింగ్ యూనిట్లు**

- షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజన సహకార కార్పొరేషన్ వివిధ విలువ ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించింది.

**ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసిన ప్రాంతాలు**

1) తేనె ప్రాసెసింగ్ యూనిట్- నిర్మల్
2) అపారదర్శక సబ్బుల యూనిట్- నిర్మల్
3) మిరప, పసుపు- ఇల్లెందులోని సుడిమల్ల

- టీజీజీసీసీ ద్వారా తయారైన గిరి బ్రాండ్ అపారదర్శక సబ్బులను గిరిజన సంక్షేమ విద్యాసంస్థలకు సరఫరా చేస్తున్నారు.

**జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం**

- నేషనల్ ట్యూబర్క్యులోసిస్ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ (ఎన్‌టీఈపీ) జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా చేపట్టిన జాతీయ క్షయ (టీబీ) వ్యాధి నిర్మూలన కార్యక్రమం ద్వారా 2025 నాటికి తెలంగాణను 100 శాతం టీబీ రహితంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2024లో స్థిరమైన 91 శాతం సాధన రేటును నిర్వహించగలిగింది.
- 2024, డిసెంబర్ 7న తెలంగాణలో టీబీ సోకే అవకాశం గల 9 జిల్లాల్లో టీబీ నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాల్ని ప్రారంభించారు.

**తెలంగాణ నేతన్న భద్రత (గతంలో నేతన్న బీమా పథకం)**

- అర్హులైన లబ్ధిదారులు (18-59 సంవత్సరాలు) అకాల మరణం సంభవిస్తే రూ. 5 లక్షల బీమాను నామినీకి అందజేస్తారు.
- చేనేత, పవర్‌లూమ్ కార్మికులు, అనుబంధ కార్మికులకు ఆర్థిక చేయూత ఇవ్వడం దీని ఉద్దేశం. ఎల్ఐసీతో కలిసి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుంది.
- 59 సంవత్సరాల కంటే ఎక్కువ వయసున్న వారికి బీమాను టీజీఎస్‌వో (తెలంగాణ హ్యాండ్లూమ్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ) అమలు చేస్తుంది. ఇది తెలంగాణ అపెక్స్ చేనేత కార్మికుల నామినీకి రూ. 5 లక్షలు అందిస్తుంది.
- 2024-25లో ఈ పథకానికి రూ. 9 కోట్లు కేటాయించారు. 2024-25లో మొత్తం 36,333 మంది వ్యక్తులు దీనికి అర్హులుగా గుర్తించారు. కోటి రూపాయల విలువైన 20 మరణ క్లెయిమ్‌లు పరిష్కరించారు.
- 2025-26 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 15 కోట్లు కేటాయించారు.

**తెలంగాణ నేతన్న పొదుపు (పొదుపు నిధి)**

- ఇది గతంలో నేతన్నకు చేయూత పథకం.
- చేనేత కార్మికులు పొదుపు చేసే 8 శాతం వేతన వాటాను ప్రభుత్వం రెట్టింపుగా 16 శాతం, పవర్‌లూమ్ కార్మికులకు 8 శాతం వేతన వాటాకు సమానంగా 8 శాతాన్ని జోడిస్తుంది.
- 3 సంవత్సరాల తరువాత లబ్ధిదారుడు డబ్బులను వడ్డీతో సహా విత్ డ్రా చేసుకోవచ్చు.
- ఈ పథకం ద్వారా 38,000 మంది చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులు, 15,000 మంది పవర్‌లూమ్ కార్మికులు లబ్ధి పొందనున్నారు.
- ఈ పథకాన్ని అమలు చేయడానికి 2024-25కు రూ. 115 కోట్ల బడ్జెట్ కేటాయించారు.

**తెలంగాణ నేతన్నకు భరోసా**

- తెలంగాణ మార్క్ లేబుల్‌ను ఉపయోగించి తెలంగాణ రాష్ట్రంలో ఉత్పత్తి అయిన వస్త్ర ఉత్పత్తులను ప్రోత్సహించడం, చేనేత కార్మికులకు వేతన మద్దతు అందించడమే లక్ష్యం.
- ప్రతి నేత కార్మికుడు రూ. 18,000 వరకు అర్హులు, అనుబంధ కార్మికుడు వారి పని ఆధారంగా సంవత్సరానికి రూ. 6 వేల వరకు అందుకుంటారు. 2024-25కు రూ. 44 కోట్లు కేటాయించారు.

**ఇందిర మహిళా శక్తి చీరల పథకం**

- ఈ పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల్లో నమోదైన 64.70 లక్షల మంది మహిళలకు సంవత్సరానికి రెండు చీరలను ఉచితంగా పంపిణీ చేస్తారు.

**చేనేత కార్మికుల రుణమాఫీ పథకం**

- చేనేత కార్మికులకు లక్షలోపు ఉన్న రుణాలను మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వు నంబర్ 56ను (2025, ఏప్రిల్‌లో) జారీ చేసింది.

## రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం

- ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక 2023 ప్రకారం తెలంగాణలో మొత్తం 27,688 చ.కి.మీ అటవీ ప్రాంతం ఉంది.
- ఇది రాష్ట్ర మొత్తం భౌగోళిక ప్రాంతంలో 24.69 శాతం. ఇది జాతీయ సగటు 23.59 శాతం కంటే ఎక్కువ.

**ఇతర రాష్ట్రాల్లో మొత్తం భౌగోళిక ప్రాంతంలో అటవీ విస్తీర్ణం (శాతంలో)**

- ఛత్తీస్‌గఢ్- 44.25 శాతం
- ఒడిశా- 39.31 శాతం
- తెలంగాణ- 24.69 శాతం
- ఆంధ్రప్రదేశ్- 22.87 శాతం
- మహారాష్ట్ర- 20.13 శాతం
- కర్ణాటక- 19.96 శాతం
- తమిళనాడు- 17.8 శాతం

**మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో ఎక్కువ అటవీ విస్తీర్ణ శాతం గల జిల్లాలు**

1) ములుగు- 64.64 శాతం
2) భద్రాద్రి కొత్తగూడెం- 41.38 శాతం
3) జయశంకర్ భూపాలపల్లి- 41.15 శాతం
4) మంచిర్యాల- 41.09 శాతం

**మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో తక్కువ అటవీ విస్తీర్ణ శాతం గల జిల్లాలు**

1) కరీంనగర్- 2.29 శాతం
2) జోగులాంబ గద్వాల- 2.32 శాతం
3) హనుమకొండ- 3.40 శాతం
4) వరంగల్- 3.53 శాతం
5) జనగామ- 4.44 శాతం

**వన మహోత్సవం**

- ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 24 శాతం అటవీ విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీన్ని సాధించడానికి రెండు ప్రధాన ప్రాంతాలను గుర్తించింది.
- నోటిఫైడ్ అటవీ ప్రాంతాల్లో చేపట్టే కార్యక్రమాలు. నోటిఫైడ్ అటవీ ప్రాంతాల వెలుపలి ప్రాంతాల్లో చేపట్టే కార్యక్రమాలు.
- ఇప్పటి వరకు దాదాపు 312.13 కోట్ల మొక్కలు నాటారు. వీటిలో వనమహోత్సవం కింద రాష్ట్రంలో 55.66 కోట్ల మొక్కలు పునరుజ్జీవింపబడ్డాయి.
- 2024-25లో 20.02 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా 2024-25 (2025, ఫిబ్రవరి నాటికి) లో 18.90 కోట్ల మొక్కలు నాటారు.

## నీతి ఆయోగ్ 10వ సమావేశం

- నీతి ఆయోగ్ 10వ పాలక మండలి సమావేశం 2025, మే 24న ఢిల్లీలో నిర్వహించారు.
- ‘2047 నాటికి వికసిత్ భారత్ సాధనకు వికసిత రాష్ట్రాలు’ అనే ఇతివృత్తంతో ఈ సమావేశం చేపట్టారు.
- ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్టుగా ప్రతి రాష్ట్రం కనీసం ఒక్కో పర్యాటక ప్రాంతాన్ని అన్ని సదుపాయాలతో అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని ప్రధాని మార్గదర్శనం చేశారు.
- ఒక రాష్ట్రం ఒక ప్రపంచ గమ్యస్థానం అని ఎంచుకొని అభివృద్ధి చేయాలి.
- భవిష్యత్తు అవసరాలను తీర్చగలిగేలా చేయాలి.
- మహిళలకు గౌరవ ప్రధానంగా తగిన భాగస్వామ్యం కల్పించాలి. దానికి తగ్గట్టుగా చట్టాలు, విధానాలు రూపొందించాలి.

**భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ**

- ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం వెల్లడించారు.
- ఐఎంఎఫ్ (అంతర్జాతీయ ద్రవ్య నిధి) అంచనా గణాంకాల ప్రకారం అమెరికా, చైనా, జర్మనీ తరువాత భారత్ నాలుగో స్థానంలో నిలిచింది.

**ఐఎంఎఫ్ ప్రకారం టాప్-10 ఆర్థిక వ్యవస్థలు**

1) అమెరికా- జీడీపీ 30.51 లక్షల కోట్ల డాలర్లు
2) చైనా- జీడీపీ 19.23 లక్షల కోట్ల డాలర్లు
3) జర్మనీ- జీడీపీ 4.74 లక్షల కోట్ల డాలర్లు
4) భారతదేశం- జీడీపీ 4.19 లక్షల కోట్ల డాలర్లు
5) జపాన్- జీడీపీ 4.19 లక్షల కోట్ల డాలర్లు
6) యూకే- జీడీపీ 3.84 లక్షల కోట్ల డాలర్లు
7) ఫ్రాన్స్- జీడీపీ 3.21 లక్షల కోట్ల డాలర్లు
8) ఇటలీ- జీడీపీ 2.42 లక్షల కోట్ల డాలర్లు
9) కెనడా- జీడీపీ 2.23 లక్షల కోట్ల డాలర్లు
10) బ్రెజిల్- జీడీపీ 2.13 లక్షల కోట్ల డాలర్లు

పన్నాల శ్రవణ్ కుమార్
ఎకానమీ ఫ్యాకల్టీ
హైదరాబాద్
9866709280

